
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## ౬౦ వ భాగం

### దక్ష ప్రజాపతి – 9

### యజ్ఞ వినాశనం

సతీదేవి దేహ త్యాగం చేసాక పరమేశ్వరుడు కోపంతో వీరభద్రుణ్ణి సృష్టించాడనీ, ఆ వీరభద్రుడి తో వెళ్ళి దక్షుణ్ణీ, ఆయన చేసే యజ్ఞాన్నీ నాశనం చేయమని చెప్పాడనీ క్రితం వ్యాసంలో చూసాం. కోపంతో రెండో రుద్రుడిలా వీరభద్రుడు అలా శివగణాలని తీసుకుని భూమి అదిరేటట్టు వస్తూంటే ఉత్తర దిక్కునుండి బ్రహ్మాండమైన ధూళి మేఘాలు బయల్దేరాయి. వాటిని చూసి దక్షుడు చేసే యజ్ఞవాటికలో వాళ్ళిలా అనుకుంటున్నారు.

సీ. ఈ ధూళి పుట్టుట కెయ్యది హేతువో? ;
విలయ సమీరమా? పొలయ దిపుడు;
ప్రాచీనబర్హి ధరాపతి మహితోగ్ర;
శాసనుఁ డిపుడు రాజ్యంబు చేయఁ
జోర సంఘములకో రారాదు; మఱి గోగ;
ణాళి రాకకు సమయంబు గాదు;
కావున నిప్పుడు కల్పావసానంబు;
గాఁబోలుఁ; గా దటు గాక యున్న [4-113]

తే. నిట్టి యౌత్పాతిక రజ మెందేనిఁ గలదె?'
యనుచు మనముల భయమంది రచటి జనులు
సురలు దక్షుఁడు; నంతఁ బ్రసూతి ముఖ్యు
లయిన భూసురకాంత లిట్లనిరి మఱియు. [4-113.1]

ఈ ధూళి పుట్టడానికి కారణం ఏమిటి? ప్రళయంలో వచ్చేటువంటి వాయువులా (విలయ సమీరమా)? అవి రావడానికి ఆస్కారమే లేదు. ప్రాచీనబర్హి అనే రాజు పరిపాలించినప్పుడు – ఆయన చండశాసనుడు కనక – ఆయనని గద్దె దింపడానికి దొంగలు బయల్దేరారా అనుకుందామనుకోవడానికి లేదు ఎందుకంటే ఇది ప్రాచీనబర్హి కాలం కాదు. మరి సాయంత్రం గోవులు ఇంటికొస్తున్నప్పుడు వచ్చే ధూళి అనుకోవడానికి

ఇది సంధ్యా సమయం కాదు. ఇవన్నీ చూస్తే ఇప్పుడు కల్పాంతకాలం వచ్చినట్టుంది లేకపోతే దీనికి వేరే మరొకటి ఏదీ తోచదు. అయితే ప్రసూతి మొదలైన బ్రాహ్మణ స్త్రీలు (భూసుర = భూమికి దేవతలు) ఇలా అన్నారు.

క. తన కూఁతులు చూడఁగ నిజ
తనయను సతి ననపరాధఁ దగవఱి యిట్లె
గ్గొనరించిన యీ దక్షుని
ఘనపాప విపాక మిదియుఁ గాఁదగు ననుచున్. [4-114]

తన మిగతా కూతుర్లందరూ చూస్తుండగా తన స్వంత కూతుర్ని న్యాయం తప్పి — అంటే అన్యాయంగా - అందరి ముందూ అవమానం చేసాడీ దక్షుడు. అటువంటి పాపానికి ఈ కనిపించే ధూళి పాపఫలం అయి ఉండవచ్చు. ఈ పద్యంలో "న్యాయం తప్పి" అనేదీ "అవమానం" అనేవీ ఎక్కడున్నాయో చెప్పగలరా? (తగవరి — న్యాయం తప్పి; యిట్లెగ్గొనరించిన — ఎగ్గు — అవమానము)

వ. వెండియు నిట్లనిరి - కుపితాత్ముండైన దక్షుండు దన కూఁతుతో విరోధంబు చాలక జగత్సంహార కారణుం డయిన రుద్రునిం గ్రోధింప జేసె; అమ్మహాత్ముండెంతటివాడన్నం బ్రళయకాలంబున [4-115]

సీ. సుమహిత నిశిత త్రిశూలాగ్ర సంప్రోత;
నిఖిల దిక్కరి రాజనివహుఁ డగుచుఁ
జటులోగ్రనిష్ఠుర స్తనిత గంభీరాట్ట;
హాస నిర్భిన్నాఖిలాశుఁ డగుచు
భూరి కరాళవిస్ఫార దంష్ట్రా హతి;
పతిత తారాగణ ప్రచయుఁ డగుచు
వివిధ హేతివ్రాత విపుల ప్రభాపుంజ;
మండిత చండ దోర్దండుఁ డగుచు [4-116]

తే. వికట రోష భయంకర భ్రుకుటి దుర్ని
రీక్ష్య దుస్సహ తేజోమహిముఁ దనర్చి
ఘన వికీర్ణ జటాబంధ కలితుఁ డగుచు
నఖిల సంహార కారణుఁ డయి నటించు. [4-116.1]

మళ్ళీ ఇలా అన్నారు — కోపంతో ఈ దక్షుడు కూతురుతో విరోధం తెచ్చుకోవడం చాలదనుకున్నాడు కాబోలు, జగత్సంహారకుడైన రుద్రుడికి కోపం తెప్పించాడు. ఆ రుద్రుడెటువంటివాడంటే, ప్రళయకాలంలో సమస్త దిగ్గజాలనీ తన త్రిశూలానికి గుది గుచ్చుతాడు; దిక్కులు పిక్కటిల్లేలా అట్టహాసం చేస్తూ నక్షత్రమండలాలని నేలకూల్చుతాడు; రకరకాల ఆయుధాలు ధరించి భృకుటిమీద కోపం చూపిస్తూ, తేరి చూడలేని తేజస్సుతో సర్వాన్నీ సంహరించగలడు.

తే. అట్టి దేవునిఁద్రిపుర సంహార కరునిఁ
జంద్రశేఖరు సద్గుణసాంద్రు నభవు
మనము రోషింపఁ జేసిన మంగళములఁ
బొంద వచ్చునె పద్మగర్భునకునైన? [4-117]

అటువంటి దేవుణ్ణి, త్రిపురాసురలని సంహరించినవాడిని, జటాజూటంలో చంద్రుణ్ణి ధరించినవాణ్ణి, సద్గుణసాంద్రుడైన అభవుణ్ణి (అభవుడు = పుట్టుక లేనివాడు) కోపింప చేసాడు. అటువంటి పనులు చేస్తే బ్రహ్మ (పద్మ గర్భుడు) అంతటివాడికైనా మంచి జరుగుతుందా? ఈ పద్యంలో పోతన ఏం చెప్తున్నాడో అనేది ఓ సారి చూద్దాం.

వినాయకుడు తిన్న తిండి వల్ల నడవలేక కిందపడినప్పుడు పొట్టపగిలిందనీ దాన్ని చూసి చంద్రుడు నవ్వేడు అనీ తెలుసు కదా మనకి? దానికి అమ్మవారు కోపం తెచ్చుకుని చంద్రుణ్ణి శపించిందని – చంద్రుణ్ణి ఎవరు ఎప్పుడు చూసినా సరే నీలాపనిందలు పాలవుతారని కథ. అయితే చంద్రుడు మరీ మరీ క్షమించమని వేడుకున్నాక ఆ శాపాన్ని "వినాయకచవితి నాడు మాత్రమే" అని సరిదిద్దుతుంది అమ్మవారు. అయినా ఇంకా చంద్రుడు వేడుకుంటూంటే, శివుడు చంద్రుణ్ణి చేత్తో తీసుకుని తన తలలో పెట్టుకున్నాడని కథనం. అంటే శివుడు ఎంత సులభంగా (అమ్మవారికి కోపం ఉన్నా సరే) ప్రసన్నుడవుతాడో చెప్తూ సద్గుణసాంద్రుడు అన్నాడు పోతన. అసలు "శివ" అంటే మంగళకరుడు అనే అర్థం. అంతటి మంచి గుణాలున్నవారికి కోపం రావడం అనేది దాదాపు అసాధ్యం. కానీ దక్షుడు చిన్నవిషయాన్ని పీకి పీకి లాగి ఇన్ని సద్గుణాలున్న, మంగళకరుడైన శివుడికి కోపం తెప్పించాడు. అటువంటి కోపం – అంటే సద్గుణాలున్న వారి కోపం – తప్పించుకోవడం అసాధ్యం కదా?

వ. అని యివ్విధంబున భయవిహ్వలలోచనలై పలుకుచున్న సమయంబున మహాత్ముండైన దక్షునకు భయావహంబులై సహస్ర సంఖ్యాతంబు లైన మహోత్పాతంబులు భూనభోంతరంబులఁ గానంబడుచుండె; ఆ సమయంబున రుద్రానుచరులు నానావిధాయుధంబులు ధరియించి కపిల పీత వర్ణంబులు గలిగి వామనాకారులు, మకరోదరాననులు నై యజ్ఞశాలాప్రదేశంబునం బరువులుపెట్టుచుఁ గదియం జనుదెంచి దక్షాధ్వర వాటంబులు విటతాటంబులు చేయుచుం, గొందఱు ప్రాగ్వంశంబును, గొందఱు పత్నీశాలయు, కొందఱు సదస్య శాలయుఁ, గొంద ఱాగ్నీధ్ర శాలయు, కొందఱు యజమాన శాలయుఁ, గొందఱు మహానస గృహంబును విధ్వంసంబులు గావించిరి; మఱియుఁ గొందఱు యజ్ఞపాత్రంబుల నగ్నులం జెఱచిరి; వెండియుఁ గొందఱు హోమాగ్ను లార్చిరి; పదంపడి కొందఱు హోమకుండంబుల యందు మూత్రంబులు విడిచిరి; కొంద ఱుత్తరవేదికా మేఖలలు ద్రెంచిరి; కొందఱు మునుల బాధించిరి; కొందఱు తత్పత్నుల వెఱపించిరి; మఱికొందఱు దేవతా నిరోధంబుఁ గావించిరి; అంత మణిమంతుండు భృగువును, వీరభద్రుండు దక్షునిఁ, జండీశుండు పూషుని, భగుని నందీశ్వరుండును బట్టిరి; ఇవ్విధంబున సదస్య దేవ ఋత్విఙ్నికాయంబుల శిలల ఱువ్వియు, జానువులఁ బొడిచియు, నఱచేతుల నడచియు, గుల్ఫంబులఁ బొడిచియు వివిధ బాధలు పఱచిన వారు కాందిశీకు లై యెక్కడెక్క దేనిం జనిరి; మఱియును. [4-118]

ఇలా అందరూ తలో మాటా అనుకునేసరికి దక్షుడికి దశదిశల్లోనూ అనేకానేక ఉత్పాతాలు కనిపించడం మొదలైంది. ఈ వచనంలో దక్షుణ్ణి పోతన ఏమన్నాడో గమనించారా? "మహాత్ముండైన దక్షుడు." భగవంతుణ్ణి అంత కోపింపచేసినవాడు మహాత్ముడెలా అవుతాడనే సందేహం వస్తే దానికి రెండు, మూడు సమాధానాలు చెప్పుకోవచ్చు. మొదటిది పోతన మహాభాగవతంలో ఎవర్నీ కూడా కించపరిచే విధంగా రాయలేదు – హిరణ్యాక్ష, హిరణ్యకశిపులని కానీ, అలాగే దక్షుణ్ణి కానీ. రెండోది – సతీదేవి ప్రజాపతికి కూతురిగా పుట్టి ఆ మానవ దేహం త్యాగం చేసి జగన్మాతగా, అర్ధనారీశ్వరుడిగా మారడానికి కారణం దక్షుడు. ఎంతటి మహాత్ముడు కాకపోతే ఆయనకి సతి కూతురిగా పుట్టగలదు? మూడో విషయం – ఇప్పుడైతే శివుడికి కోపం తెప్పించాడు కానీ అసలు దక్షుడు ప్రజోత్పత్తికి సాక్షాత్తూ బ్రహ్మచేత సృజించబడిన ప్రజాపతి. అందువల్ల కూడా దక్షుడు మహాత్ముడికిందే లెక్క.

ఇలా యాగశాలలోకి వీరభద్రుడితో వచ్చిన శివగణాలు అక్కడ హోమాలన్నీ ఆర్పడం, పాత్రలన్నీ చెల్లాచెదురు చేయడం, మునులని భాధించడం మొదలుపెట్టారు. మణిమంతుడు భృగువునీ, వీరభద్రుడు దక్షుణ్ణీ, నంది భగుణ్ణీ పట్టి పీడించడం సాగించారు. ఇలా పట్టుకున్నవాళ్లని ఒళ్ళు చితకపొడిచి బాధలు పెట్టేసరికి ఇటు అటూ పారిపోయారు.

క. ముసు దక్షుఁ డభవుఁ బలుకఁ 'గఁ
గను గీఁటిన' భగునిఁ బట్టి కన్నులు పెకలిం
చెను నందీశ్వరుఁ; డచ్చటి
జనముల హాహారవంబు సందడి గొలుపన్. [4-119]

దక్షుడు మొదట్లో శివుణ్ణి తూలనాడుతుంటే సరదాగా కన్నుగీటిన భగుణ్ణి పట్టుకుని నందీశ్వరుడు ఏ కనులతో అయితే శివుణ్ణి వెక్కిరించాడో ఆ కళ్ళు పీకి పారేసేసరికి యజ్ఞవాటికలో హాహకారాలు చెలరేగాయి.

తే. కుపితుఁడై నాఁడు భవుని దక్షుఁడు శపింపఁ
'బరిహసించిన' పూషుని పండ్లు డుల్లఁ
గొట్టె బలభద్రుఁ డా కళింగుని రదంబు
లెలమి దులిచిన పగిదిఁ జండీశ్వరుండు. [4-120]

దక్షుడు పరమేశ్వరుణ్ణి అందరిముందూ శపించినప్పుడు విపరీతంగా నవ్విన (పరిహసించిన) పూషుడికి – బలభద్రుడు కలింగుడనేవాడి దంతాలు ఊడగొట్టినట్టుగా – నందీశ్వరుడు పళ్ళు రాలగొట్టాడు. ఈ పద్యంలో పోతన దంతాలు అనేదానికి రెండు పదాలు వాడాడు గమనించారా? (పండ్లు, రదంబులు)

క. తగవేది దక్షుఁ డా సభ
నగచాపుఁ దిరస్కరించునాఁ డట 'శ్మశ్రుల్
నగచుం జూపుట' నా భృగు
పగకై శ్మశ్రువులు వీరభద్రుఁడు పెఱికెన్. [4-121]

ఆ నాడు శివుణ్ణి దూషించినప్పుడు దక్షుణ్ణి సమర్థిస్తూ మీసాలు తిప్పిన భృగు మహర్షి మీసాలు వీరభద్రుడు పెరికి పారేసాడు. పై పద్యంలో శివుడు, మీసాలు అనే పదాలు ఎక్కడున్నాయో చెప్పుకోండి చూద్దాం? నగచాపు = నగ – మేరుపర్వతాన్ని; చాపు – ధనస్సుగా పట్టినవాడు; శివుడు. శ్మశ్రువులు – మీసాలు.

సీ. అతుల దర్పోద్ధతుండై వీరభద్రుండు;
గైకొని దక్షు వక్షంబుఁ ద్రొక్కి
ఘనశితధారాసిఁ గొని మేను వొడచియు;

మంత్రసమన్విత మహిత శస్త్ర
జాలావినిర్భిన్న చర్మంబు గల దక్షుఁ;
జంపఁగా లేక విస్మయము నొంది
తద్వధోపాయంబు దన చిత్తమునఁ జూచి;
కంఠనిష్పీడనగతిఁ దలంచి [4-122]

తే. మస్తకముఁ దున్మి యంచితామర్షణమున
దక్షిణాలనమున వేల్చెఁ దదనుచరులు
హర్షమును బొంద; నచటి బ్రాహ్మణజనంబు
లాత్మలను జాల దుఃఖంబు లందుచుండ. [4-122.1]

ఇంత అయ్యాక ఇప్పుడు దక్షుడి వంతు. వీరభద్రుడు దక్షుడి వక్షం మీద తొక్కి, ఒళ్ళు తూలగొట్టి, మంత్రసహితమైన అస్త్రాలు వేసినా చావకపోయేసరికి ఆశ్చర్యంతో కంఠం శరీరాన్నుంచి వేరుచేసి అక్కడున్న దక్షిణాగ్నిలో పారేసాడు. దక్షుడి ప్రాణం ఎందుకుపోలేదంటే – ఆ శరీరం శస్త్రాస్త్రాలకి పడిపోయేది కాదు కనక. అలా పడిపోయేది అయితే ప్రజాపతి అవలేడు కదా? అదీగాక దక్షుడు అనేకానేక యజ్ఞాలు చేసిన పుణ్యాత్ముడు.

వ. ఇట్లు వీరభద్రుండు దక్షుని యాగంబు విధ్వంసంబు గావించి నిజ నివాసంబైన కైలసంబునకుఁ జనియె నయ్యవసరంబున.
[4-123]

ఇలా వీరభద్రుడు చెప్పిన పని పూర్తి చేసాక తనని సృష్టించిన తండ్రి అయిన శివుడు తో చెప్పడానికి కైలాసానికి వెళ్ళాడు వెనక్కి, అందరితోపాటు. గమనించారా, ఇక్కడ వీరభద్రుడు విధ్వంసం చేస్తూంటే ముందు శివగణాలని అభిచార హోమం చేసి వెళ్లగొట్టిన భృగువు కానీ, మరొకరు కానీ ఏమీ చేయలేకపోవడం? అదే పరమేశ్వరుడు వీరభద్రుడితో చెప్పినది – “నరిది మదంశసంభవుఁడవై తగు నీకు నసాధ్య మెయ్యెడన్” – నువ్వు నాలోంచి పుట్టిన ఈశ్వరాంశ సంభూతుడివి, నీకు అసాధ్యం అన్నదే లేదు.

వచ్చే వ్యాసాల్లో ప్రళయ కాలం వచ్చేటంతటి కోపంతో శివుడు వీరభద్రుణ్ణి సృష్టించినా ఆ కోపం పోయి దక్షుణ్ణి అనుగ్రహించడం, అసలెందుకు దక్షుడు చిన్న విషయానికి కోపం తెచ్చుకుని పీకల మీదకి తెచ్చుకున్నాడో, శివుడెందుకు లేచి దక్షుడికి వందనం చేయలేదో శివుడే అందరితో చెప్పడం అనే విషయాలు చూస్తాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS